# చామంతి

ఏడాదికోసారి చుట్టపుచూపుగా విచ్చేసే వసంతం గుండెల్లో పులకింతలు రేపిన కారణంగా నూతన వధువులా కళకళ లాడిపోతోంది అడవంతా. ఊడలు దీరిన వటవృక్షాలు, రకరకాల మొక్కలు ఆకులతో, పూలతో కాయలతో నిండి శ్రద్ధగా అలంకరించుకున్న నృత్యాంగనలా వికసించిపోతున్నాయి. అప్పుడే పూచిన వసివాడని సుమబాలలు బోసినవ్వులు ఒలికిస్తుంటే, ఎప్పుడో పూచి పెద్దరికం సంతరించుకున్న పూబోణులు దరహాసాలను కురిపిస్తున్నాయి. అవి అడవి కాచిన పుష్పాలే అయినా ప్రకృతి మాతకు ఆభరణాలుగా విలసిల్లుతున్నాయి.

ఎటుచూసినా పచ్చదనం, అల్లిబిల్లిగా అల్లుకున్న అడవితీగెలూ, వాగులూ, సెలయేళ్లు, హాయిగొలిపే వాయువీచికలు. ఎక్కడ ఏ అలికిడి అయినా బిత్తర చూపులు చూస్తూ బెదురు గొడ్డుల్లా గెంతులు వేసే భీతహరిణులూ, పొద నుండి పొదకు పరుగులుతీసే కుందేళ్లూ, అయోధ్యరాముడి అభిమాన చిహ్నాలైన వీపుమీద చారలను సగర్వంగా ప్రదర్శించుకుంటూ ఉత్సాహంతో ఉరకలువేసే ఉడత చిన్నారులు, ఏదో పని వున్నట్టు ఒక చెట్టుమీంచి మరో చెట్టుమీదకు దుమికే మర్కటాలూ... పక్షుల కిలకిల రావాలూ, కోయిలల కుహుకుహు నాదాలూ అడవంతా తానే అయి వసంతకన్య మైమరచి నర్తిస్తూంటే... నిండుగా, కనులపండువుగా వుంది.

ఆ రమణీయ దృశ్యాలను, కమనీయ శబ్దాలనూ మైమరచి ఆస్వాదిస్తున్న ధనుష్‌కి, కవి అద్భుతభావం మదిలో మెదిలింది... 'తరలి రాద తనే వసంతం... తన దరికిరాని వనాల కోసం!?'

హైద్రాబాద్‌లో ఇంజనీరుగా పనిచేస్తూన్న పాతికేళ్ల ధనుష్ స్నేహితులతో కలసి ఆ ప్రాంతానికి వనవిహారానికి వచ్చాడు. మిత్రులంతా పేకాయణం పారాయణం చేస్తూంటే ప్రకృతి అందాలకు పరవశిస్తూ అద్భుతంగా తోచిన దృశ్యాలను వీడియోకామ్‌తో బంధిస్తూ కదిలాడతను. దూరంలో కానవచ్చిన ఓదృశ్యం అతన్ని ఆకట్టుకుంది. సరస్సులో దిగి దప్పిక తీర్చుకుంటున్న ఓ లేళ్లగుంపు అది. సుందర దృశ్యాన్ని చిత్రీకరించడానికి చిన్న గుట్టపైకి ఎక్కి వ్యాసరిచేసుకోబోయాడు. కాలు జారి వెనక్కి పడిపోయాడు. తల చెట్టు మొదలుకు తగలడంతో స్పృహకోల్పోయాడు...

ధనుష్ కన్నులు తెరిచేసరికి ఎదురుగా ఓ సౌందర్యపు మెరుపు మెరిసింది. ఓ అందమైన యువతి అతనిపైకి వాలి ముఖంలో ముఖం పెట్టి చూస్తోంది. ఆమె ఊపిరి అతని ముఖానికి వెచ్చగా సోకుతోంది.

అతను కనులు తెరవడం చూసి, "ఎలా వుంది బాబూజీ?" అంటూ పరామర్శించిందామె. కోయిల పలికిందా అన్నట్టు చుట్టూ చూసాడు. అది ఆమె స్వరమేనని గ్రహించాడు. తాను హంసతూలికా తల్పంపైన శయనించినట్లు అనిపించింది. తన తల ఆమె ఒడిలో వున్నట్లు గ్రహించాడు. "నాకేమయింది?" ఆశ్చర్యంగా అడిగాడు లేచి కూర్చుంటూ.

"తెలివి తప్పుంటే... సేదదీర్చాను" అందామె లేచి నిలుచుని.

జరిగిందేమిటో కొద్దికొద్దిగా జ్ఞప్తికి వచ్చిందతనికి. కృతజ్ఞతగా చూస్తూ ఆమెను పరిశీలించా

డు... అడవిలో పూచిన బొండుమల్లి అని ఆమె వేషభాషలు చెబుతున్నాయి. చిన్న చిన్న అద్దాలు, చమ్కీలతో కూడిన ఎర్రటి పరికిణీ ముదుకుల వరకు వుంది. దానిపైన అదే రంగు బ్లౌజు తప్ప మరో ఆచ్ఛాదనలేదు. పద్దెనిమిదేళ్లుంటాయి. చక్కటి అవయవ సౌష్టవం దోరమగ్గిన జాంపండు మేనిఛాయ. ఒత్తైన, పొడవైన జడలు జోడుపాముల్లా ఎత్తైన ఆమె పిరుదులమీద పొరాడుతున్నాయి. సహజ సౌందర్యంతో వన కన్యలా వుంది. ఆల్చిప్పల్లాంటి కనులను తాటిస్తూ ఆమె తన వంక చూస్తుంటే ఆ కనులను ముద్దాడాలనిపించిందతనికి. తొలిచూపులోనే అతని మదిని దోచుకుందామె.

ధనుష్ కూడా హ్యాండ్సమ్‌గా వుంటాడు. దాదాపు ఆరడుగుల పొడవు, తెలుపూను... అతని వంకే రెప్పవేయకుండా చూస్తోందామె.

కనులు, కనులు కలుసుకున్నాయి. చూపులు పలకరించుకున్నాయి. ఇరు హృదయాల లోనూ ఏదో అలజడి, వింత అనుభూతి.

కోతుల కిచకిచలతో తేరుకున్నారు ఇద్దరూ. “అడవితల్లి ముద్దుబిడ్డలా వున్నావు. నీ పేరేంటి?” అడిగాడు మందహాసంతో.



విశ్వమోహిని

విరిసీ విరియని అధరాలపైన చిరునవ్వు మొయించిందామె. జవాబివ్వకుండా అక్కణ్ణుంచి కదిలింది.

"ఆగు! నీ పేరేమిటో నేను తెలుసుకోకూడదా?" పూలమొక్కల వద్ద ఆగిందామె. ఓ చామంతి పూవుని కోసింది. అతనివైపు అలవోకగా చూస్తూ దాన్ని జడలో తురుముకుంది.

అంతలోనే అక్కడికి వచ్చిన ఓ యువతి, "చామంతీ! రావే వెళ్దాం" అంటూ ఆమెను పిలిచింది. ఆమె అతనివంక దొంగ చూపులు చూస్తూ అక్కణ్ణుంచి తుర్రుమంది.

"చామంతా!? చక్కటి పేరు! తన పేరేమిటో ఎంత అందంగా చెప్పింది!" అనుకున్నాడు ధనుష్.

* * *

తొలిచూపులోనే చామంతిపైన మనసు పారేసుకున్న ధనుష్, ఆమెను వెదుక్కుంటూ మళ్లీ ఆ ప్రదేశానికి వెళ్లాడు. ఆశించినట్టే చామంతి తారసపడింది. ఆమెతో మాట కలిపాడు. మనసు కలిపాడు. వారి పరిచయం స్నేహంగా, స్నేహం ప్రేమగా పరిణితి చెందాయి.

అడవిలో దాదాపు ఐదుకిలోమీటర్ల దూరంలో వుంది చామంతి గూడెం. అక్కడికి ఎడ్డుల బండి బాట వుంది. రోజూ విప్పపూలు ఏరుకోవడానికి చెలికత్తెలతో కలిసి అడవిలో తిరుగుతూంటుంది చామంతి. అలా ఏరుకువచ్చిన విప్పపూలను, ఇతర ఫలాలను తల్లీ, తండ్రీ పొరుగూళ్లకు తీసుకువెళ్లి అమ్ముకువస్తుంటారు.

"మనం పెళ్లి చేసుకుందాం" అన్నాడు ధనుష్ చామంతితో ఓ రోజున.

"పట్నం బాబులతో పరిచయమంటే మా గూడెం గుండెలలో గుబులే. బడాబాబులెందరో పట్నం నుంచొచ్చి మా గూడెం ఆడపిల్లల్ని పెళ్లాడి, వాళ్లతో కాపురం చేసాక మాయమైపోయారు. కొందరికైతే పిల్లలు కూడా పుట్టారు. అందుకే పట్నవోళ్లకు దూరంగా వుండమని మా పెద్దలు హెచ్చరిస్తుంటారు" అంది ధనుష్ వొళ్లో పడుకుని చామంతి, తన చేతి గాజులతో అతను ఆడుకుంటూంటే.

"నేనూ అందరిలాంటివాడినే అనుకుంటున్నావా చామంతీ?" అన్నాడు ధనుష్ హర్టయినట్టు.

కిలకిల నవ్విందామె అతని జుట్టు రేపేస్తూ.

"రంగులో, పొంగులో గండుతుమ్మెదలన్నీ ఒకటే! పూలే పిచ్చిమొద్దులు! తనవాడు అందరికంటే భిన్నం అనుకుని మోసపోతాయి" అంది.

చిన్నబుచ్చుకున్నాడతను. అది గమనించి, చిలిపిగా అతని ముక్కు పట్టుకుని వూపిందామె. "నువ్వు భుజాలు తడుముకోవద్దు బాబూజీ!" అంటూ సన్నగా నవ్వింది.

"మీ వాళ్లను వొప్పించి నిన్ను నాదాన్ని చేసుకుంటాను" అంటూ ఆమెను ప్రేమతో చుంబించాడతను. సిగ్గుతో అతని వక్షంలో ముఖం దాచుకుందామె.

* * *

పున్నమి చంద్రుడు ఫక్కుమనడంతో అడవంతా తెల్లగా మెరిసిపోతోంది. అది అడవికాచిన వెన్నెలే అయినా ఆ ప్రణయజంట శృంగారానికి ప్రాణం పోస్తోంది.

పూపొదరింటి క్రింద తొలిరాత్రి సంభోగాన్ని వినూత్నంగా జరుపుకునేందుకు సిద్ధమైంది ఆ జంట. బాహుబంధంలో నలిగిపోతున్న ప్రేయసిని గాఢ చుంబనలతో ఉక్కిరి బిక్కిరి చేసాడు ధనుష్.

"చామంతీ!" ఆమె చెవిలో మెల్లగా పిలిచాడు.

"ఊ" మత్తుగా పలికిందామె. అతను ప్రేమానురాగాలతో శరీరమంతా సున్నితంగా తడుముతుంటే, ఆ స్పర్శకు పులకింతతో పొంగి పోయిందామె. అతని గుండెలకు మరింతగా హత్తుకుపోయింది... శంఖం వంటి ఆమె మెడ పైన పెదవులతో రాస్తూ ఆమె వొంటిమీద వలు వలు వొలువనారంభించాడు. సిగ్గులమొగ్గే అయింది. వెన్నెల్లో మెరిసిపోయాయి వారి అర్ధ నగ్న దేహాలు. నైట్‌క్వీన్ సువాసనలతో మత్తెక్కి వారిపైన పూలజల్లు కురిపించింది. అతను మేనంతా ముద్దులతో ముంచెత్తుతుంటే తీయని పులకింతలతో మెలిదిరిగిపోయింది చామంతి. ఆమె మదనతాపంతో ప్రియుణ్ణి అల్లుకుపోయింది. ఆమె పెదవులను తన పెదవులతో పెనవేసాడు. అతని క్రింది పెదవిని మునిపంటితో కొంటెగా కొరికిొందామె. 'అబ్బా!' అన్నాడు చిన్నగా...

హఠాత్తుగా కారుకు బ్రేక్‌పడింది. కలకరిగిపోయింది. తీయటి ఊహల్లోంచి కుదుపుతో బైటపడ్డ ధనుష్ ముందుకు చూసాడు... ఓ వ్యక్తి కారుకు అడ్డుగా నిలుచున్నాడు.

పట్టరాని ఆగ్రహం కలిగింది ధనుష్‌కి ఆ వ్యక్తి మీద. తన కమ్మటి కలను కరిగించివేసాడు, దుష్టుడు!

గూడెం మనిషిలా వున్నాడు. "దొరా! ఆడ మనిషికి పేనం మీదకొచ్చింది. ఎంటనే పట్నం తీసుకెల్లి ఆస్పత్రిల చేర్పించమన్నడు మాగూడెం వైద్యుడు..." అన్నాడు ఆ వ్యక్తి.

అప్పుడు గమనించాడు ధనుష్. బాట ప్రక్కన ఇద్దరు మనుషులు డోలీతో నిలుచున్నారు. డోలీ లోపల మనిషి పడుకునివుంది.

"అయితే?" విసుగ్గా అన్నాడు ధనుష్.

"దొరా! గూడెంలో వుండే ఎద్దుబండి ఇరుసు ఇరిగిపోయింది. డోలీతో కాలినడకను పట్నంసేరే ఏలకు మనిసి చచ్చిపోతాదని బయంగా వుంది" ప్రాధేయపూర్వకంగా అన్నాడు ఆ వ్యక్తి. "దేవుడు పంపినట్టు వున్నాం కట్టుకో దొరా!"

అంతవరకు చామంతితో గడిపి, ఆనక స్వప్నలోకాలలో గడుపుతూ ఇంటిముఖం పట్టాడు ధనుష్. ఆ మధుర స్వప్నాన్ని ఛేదిస్తూ చావడానికి సిద్ధంగావున్న ఓ మనిషికి తన కారులో ఎక్కించుకోమనేసరికి కోపం వచ్చింది.

"దొరా! ఆలోచించకు. పసికూనలున్నారు దానికి. దాని పేనం కాపాడి ఆళ్లకు తల్లిబిచ్చ పెట్టు" బ్రతిమాలాడు ఆ వ్యక్తి.

గొప్ప చిరాకు కలిగింది ధనుష్‌కి. "ఏయ్, ఏమిటీ ఈ న్యూసెన్స్? అడ్డమైనవాళ్లూ ఎక్కడానికిది సర్కారు బస్‌కాదు. లక్షలు ఖరీదుచేసే ఫారిన్‌కారు. అడ్డు తప్పుకో" అంటూ గట్టిగా కసురుకుని, నిర్దాక్షిణ్యంగా కారును ముందు కురికించాడు.

* * *

మర్నాడు చామంతి తల్లిదండ్రులను కలిసి తమ వివాహానికి వారి అనుమతి పొందేందుకని గూడెం వెళ్లాడు ధనుష్. చామంతి అతనికి ఎదురువచ్చింది. "మా అమ్మను, అయ్యను నువ్వు కలవనవసరం లేదు బాబూజీ!" అంది.

"ఏం?" అనడిగాడు.


"మన మనువు జరుగదు కనుక" అంది.

"అంటే... మీ వాళ్లు మన పెళ్లికి సుముఖంగాలేరా?"

"కాదు, నాకే ఇష్టం లేదు"

"జోకా?" కాదని తలూపింది అడ్డుగా.

తెల్లబోయాడతను "ఎందుకూ?"




ముందురోజు రాత్రి స్నేహితురాలి అక్కయ్య చనిపోయిందని తెలిసి చూడడానికి వెళ్లింది చామంతి. అప్పుడు తెలిసింది. ఆస్పత్రికి తీసుకువెళ్లడానికి ధనుష్‌ని లిఫ్ట్ అడిగితే అతడు అమానుషంగా ప్రవర్తించిన తీరు. నమ్మలేకపోయింది. ఆమె చావుకు కారకుడు అతనేననిపించింది... ఆ విషయమే చెప్పింది అతనితో.

"నన్ను మనువాడి గూడాన్ని ఉద్ధరిస్తానంటూ ఏవేవో కబుర్లు చెప్పావు. చావుబ్రతుకుల్లో వున్న ఓ ఆడమనిషిని నీ కారులో ఎక్కించుకోవడానికి ఇచ్చగించనివాడివి గూడాన్ని ఏం ఉద్ధరిస్తావ్? మాయమాటలు చెప్పి మా గూడెం పిల్లల్ని పెళ్లాడి వాంఛ తీర్చుకుని, వాళ్లను గాలికొదిలేసి వెళ్లిపోయిన ఇతర పట్నపోల్లకు, నీకూ తేడా కనిపించలేదు నాకు..."

"సారీ చామంతీ! పొరపాటు జరిగిపోయింది. నేను చెడ్డవాణ్ణికాదు. నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను" అంటూ నచ్చజెప్పబోయాడు ధనుష్ గంటుపడ్డ ముఖంతో.

"తొందరపడి నిర్ణయం తీసుకోకు. ఇంకెప్పుడూ జరగదని హామీ ఇస్తున్నాను" బ్రతిమాలుతూ ఆమె చేతులు పట్టుకున్నాడు.

"ఈ గూడెం అంతా ఒకే కుటుంబం బాబూజీ! స్వార్థం పాలు మాలో చాలా తక్కువే. మానవత్వానికి, పరస్పర సహకారానికీ పెద్దపీట వేయడం మాజాతి ఆచారం, ఈ గూడెం పడికట్టు..." శాంతంగా అందామె.

"నిన్ను మనువాడి... నీ స్వార్థం నా స్నేహితురాలి అక్కను బలిగొందన్న తలంపు జీవితమంతా నన్ను దొలిచేస్తూంటే... నేను భరించలేను బాబూజీ! మాగూడెం అంతా నీ వంక అసహ్యంగా చూస్తూంటే... నేను తట్టుకోలేను. అందుకే ఈ నిర్ణయం".

అతని చేతులు విడిపించుకుని, అతను ఏదో చెప్పబోతూంటే వినిపించుకోకుండా అక్కణ్ణుంచి పరుగున వెళ్లిపోయింది చామంతి ముందుకు వస్తూన్న దుఃఖం అతని కంట పడకుండా ముఖం చేతుల్లో కప్పుకుని.